
నేడే ఓట్ల పండుగ



▶ మొదటి పేజీ తరువాయి

అనంతరం డిసెంబర్ 5తో శాసనసభ ఎన్నికల ప్రక్రియ ముగియనుంది.

మూడు కోట్లకుపైగా ఓటర్లు

రాష్ట్రంలో 1,63,01,705 మంది మహిళలు, 1,62,98,418 మంది పురుషులు, 2,676 మంది మూడో జెండర్ ఓటర్లు కలిపి మొత్తంగా 3,26,18,205 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. మొత్తం 119 నియోజకవర్గాల్లో కలిపి 2,067 మంది పురుష అభ్యర్థులు, 222 మంది మహిళా అభ్యర్థులు, మూడో జెండర్ అభ్యర్థి ఒకరు కలిపి మొత్తం 2,290 మంది ఎన్నికల్లో పోటీపడుతున్నారు.

ఏ పార్టీల నుంచి ఎంత మంది అభ్యర్థులు?

రాష్ట్రంలోని మొత్తం 119 అసెంబ్లీ సీట్లలో బీఆర్ఎస్ పోటీచేస్తోంది. కాంగ్రెస్ 118 సీట్లలో, ఆ పార్టీ పొత్తుతో సీపీఐ ఒకచోట బరిలో ఉన్నాయి. మరో కూటమిలో భాగంగా బీజేపీ 111, జనసేన 8 స్థానాల నుంచి పోటీ చేస్తున్నాయి. బీఎస్పీ 107 చోట్ల, ఎంఐఎం 9 చోట్ల, సీపీఎం 19 చోట్ల, సీపీఐఎల్(న్యూడెమోక్రసీ) ఒకచోట తలపడుతున్నాయి.

➤ ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ నుంచి 41 మంది, ధర్మసమాజ్ పార్టీ నుంచి 101 మంది, జైమహాభారత్ పార్టీ నుంచి 13 మంది, రాష్ట్రీయ సామాన్య ప్రజాపార్టీ నుంచి నలుగురు, ఇతర పార్టీల నుంచి మరో 659 మంది, స్వతంత్రులు 989 మంది ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

➤ నియోజకవర్గాల వారీగా చూస్తే.. అత్యధికంగా ఎల్బీనగర్ నుంచి 48 మంది, గజ్వేల్ నుంచి 44 మంది, కామారెడ్డి, మునుగోడుల నుంచి 39 మంది చొప్పున పోటీపడుతుండగా.. అత్యల్పంగా నారాయణపేట, బాన్సువాడల్లో ఏడుగురు చొప్పున, బాల్కొండలో 8 మంది బరిలో ఉన్నారు.

35,655 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు

రాష్ట్రంలో 299 అనుబంధ పోలింగ్ కేంద్రాలు సహా మొత్తం 35,655 పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. 27,094 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ ప్రక్రియను వెబ్ కాస్టింగ్ ద్వారా ప్రత్యక్షంగా పర్యవేక్షించనున్నారు. ఎక్కువ పోలింగ్ కేంద్రాలున్న 7,571 ప్రాంతాల్లో బయటి పరిసరాలను సైతం వెబ్‌కాస్టింగ్ చేస్తున్నట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈఓ) వికాస్‌రాజ్ తెలిపారు. మిగతా పోలింగ్ కేంద్రాల్లో సీసీ టీవీ కెమెరాలు, వీడియోగ్రాఫర్లు, ఫోన్లు, ట్యాబ్స్, ల్యాప్‌ట్యాప్‌లతో విద్యార్థులు పోలింగ్ ప్రక్రియను రికార్డు చేయనున్నారు. రికార్డు చేసిన డేటాను ప్రిసైడింగ్ అధికారులు సంబంధిత నియోజకవర్గ రిటర్నింగ్ అధికారికి అప్పగిస్తారు.

పటిష్టంగా బందోబస్తు

పోలింగ్ రోజు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. 45వేల మంది రాష్ట్ర పోలీసులు, మరో 3వేల మంది అటవీ/ఆబ్కారీ సిబ్బంది, 50 కంపెనీల టీఎస్ఎస్పీ, 375 కంపెనీల కేంద్ర బలగాలను మోహరిస్తున్నారు. పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, ఏపీ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్‌ల నుంచి వచ్చిన 23,500 మంది హోంగార్డులు కూడా బందోబస్తు విధుల్లో పాల్గొంటున్నారు.

దివ్యాంగ ఓటర్లకు ప్రత్యేక సదుపాయాలు

దివ్యాంగ ఓటర్లు సులువుగా ఓటు హక్కు వినియోగించుకునేలా ఎన్నికల సంఘం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. బ్రెయిలీ లిపిలో 76,532 ఓటరు స్లిప్పులు, 40 వేల ఓటర్ గైడ్స్, 40 వేల డమ్మీ బ్యాలెట్ పేపర్లను ముద్రించి అంధ ఓటర్లకు పంపిణీ చేశారు. శారీరక వికలాంగులను ఇంటి నుంచి పోలింగ్ కేంద్రానికి తరలించడానికి ఆటోలను ఏర్పాటు చేయనున్నారు. వారికోసం పోలింగ్ కేంద్రాల వద్ద 21,686 ట్రై సైకిళ్లను అందుబాటులో ఉంచారు. ర్యాంపులను ఏర్పాటు చేశారు.

ఉదయం 5.30 గంటలకు మాక్ పోలింగ్

రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) వికాస్‌రాజ్ నేతృత్వంలో దాదాపు ఏడాది నుంచీ ఏర్పాట్లు జరిగాయి. ఎన్నికల నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఓటర్ల జాబితా సవరణ, ఈవీఎంలను సంసిద్ధం చేయడం, ఎన్నికలు/ పోలింగ్ అధికారులు, సిబ్బంది నియామకం/శిక్షణ, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, ఓటర్లకు సదుపాయాల కల్పన, భద్రతా ఏర్పాట్లను ఎన్నికల సంఘం పూర్తిచేసింది. మొత్తం 2,00,433 మంది అధికారులు, సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు. అన్నిజిల్లాల్లో పోలింగ్ సిబ్బంది డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి ఈవీఎంలు, ఇతర పోలింగ్ సామగ్రిని తీసుకుని పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారని సీఈఓ కార్యాలయం బుధవారం అర్ధరాత్రి ప్రకటించింది. వారంతా రాత్రి పోలింగ్ కేంద్రాల్లోనే బస చేస్తారు. ప్రిసైడింగ్ అధికారులు గురువారం ఉదయం 5.30 గంటలకు పోల్ ఏజెంట్ల సమక్షంలో ఈవీఎంలతో మాక్ పోలింగ్ నిర్వహిస్తారు. తర్వాత కంట్రోల్ యూనిట్‌లోని మెమరీ డిలీట్ చేసి, వీవీ ప్యాట్ కంటైనర్ బాక్స్ నుంచి మాక్ ఓటింగ్ స్లిప్పులను తొలగిస్తారు.

పోలింగ్ నిర్వహణలో పాల్గొనే అధికారుల లెక్క ఇదీ

సెక్టార్ అధికారులు	3,803
ఫ్లైయింగ్ స్క్వాడ్స్	1,251
స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్	1,316
వీడియో సర్వైలెన్స్ టీమ్స్	640
వీడియో వీవింగ్ టీమ్స్	290
సహాయ వ్యయ పరిశీలకులు	184
వ్యయ పర్యవేక్షణ బృందాలు	234
సూక్ష్మ పరిశీలకులు	12,909
రూట్ అధికారులు	4,039
ప్రిసైడింగ్ అధికారులు	43,171
ఇతర పోలింగ్ అధికారులు	1,32,596
మొత్తం	2,00,433

2018 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీల వారీగా ఓటింగ్ శాతం తీరు

పార్టీ	ఓటింగ్ శాతం
టీఆర్ఎస్/బీఆర్ఎస్	46.87
కాంగ్రెస్	28.43
బీజేపీ	6.98
టీడీపీ	3.51
ఎంఐఎం	2.71
బీఎస్పీ	2.06
ఫార్వర్డ్ బ్లాక్	0.77
సీపీఐ	0.40
సీపీఎం	0.44

రిజర్వుడ్ స్థానాల లెక్క ఇదీ..

మొత్తం సెగ్మెంట్లు:	119
ఎస్సీ రిజర్వుడ్:	19
ఎస్టీ రిజర్వుడ్:	12
జనరల్:	88

పోలింగ్ కేంద్రాల లెక్క ఇదీ..

- పట్టణ పోలింగ్ కేంద్రాలు: 14,458
- గ్రామీణ పోలింగ్ కేంద్రాలు: 20,898
- మొత్తం పోలింగ్ కేంద్రాలు: 35,356
- అనుబంధ పోలింగ్ కేంద్రాలు: 217
- సున్నిత పోలింగ్ కేంద్రాలు: 10,969
- మహిళల నిర్వహణలోని పోలింగ్ కేంద్రాలు: 597
- దివ్యాంగుల నిర్వహణలోని పోలింగ్ కేంద్రాలు: 120
- యువత నిర్వహించే పోలింగ్ కేంద్రాలు: 597
- ఆదర్శ పోలింగ్ కేంద్రాలు: 644

ఓటింగ్‌కు వాడే ఈవీఎంల వివరాలివీ..

బ్యాలెట్ యూనిట్లు:	75,464
కంట్రోల్ యూనిట్లు:	44,828
వీవీ ప్యాట్స్:	49,460

2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీల వారీగా గెలుచుకున్న సీట్ల వివరాలివీ..

పార్టీ	2014	2018
టీఆర్ఎస్/బీఆర్ఎస్	63	88
కాంగ్రెస్	21	19
ఎంఐఎం	7	7
టీడీపీ	15	2
బీజేపీ	5	1
వైఎస్సార్‌సీపీ	3	–
సీపీఐ	1	0
సీపీఎం	1	0
బీఎస్పీ	2	0
ఫార్వర్డ్ బ్లాక్	0	1
స్వతంత్రులు	1	1
మొత్తం	119	119



సరూర్‌నగర్ స్టేడియంలో ఎన్నికల కోసం ఏర్పాట్లు చేసుకుంటున్న పోలింగ్ సిబ్బంది



అసెంబ్లీ ఎన్నికలకోసం ఈవీఎం మెషీన్లు, ఇతర ఎన్నికల సామగ్రితో పోలింగ్ స్టేషన్లకు వెళ్తున్న పోలింగ్ సిబ్బంది



నిజాం కాలేజ్ గ్రౌండ్‌లో సిబ్బందికి పంపిణీ చేసేందుకు సిద్ధం చేసిన ఈవీఎం మెషీన్లు

అసెంబ్లీ ఎన్నికల ఓటర్ల వివరాలివీ..

ఓటర్లు	పురుషులు	మహిళలు	మూడో జెండర్	మొత్తం
సాధారణ ఓటర్లు	16,298,418	16,301,705	2,676	32,602,799
సర్వీస్ ఓటర్లు	14,850	556	0	15,406
మొత్తం ఓటర్లు	16,313,268	16,302,261	2,676	32,618,205
18–19 ఏళ్ల కొత్త ఓటర్లు	5,70,274	4,29,273	120	9,99,667
80 ఏళ్లపైబడినవారు	1,89,519	2,50,840	12	4,40,371
ప్రవాస ఓటర్లు	2,380	563	1	2,944
దివ్యాంగ ఓటర్లు	2,90,090	2,16,815	16	5,06,921

పోలింగ్ శాతం మళ్లీ పెరగాలి

గత అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 2,80,64,684 మంది ఓటర్లకు గాను 2,05,80,470 (73.2 %) మంది ఓటేశారు. 1,41,56,182 మంది మొత్తం పురుష ఓటర్లకు గాను 1,03,17,064 (72.54%) మంది, 1,39,05,811 మంది మొత్తం మహిళా ఓటర్లకు గాను 1,02,63,214(73.88%) మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 2691 మంది మూడో జెండర్ ఓటర్లలో కేవలం 192 (8.99%) మంది మాత్రమే ఓటేశారు. 2014 అసెంబ్లీ సాధారణ ఎన్నికల్లో కేవలం 69.5శాతం పోలింగ్ మాత్రమే నమోదైంది. 2014 ఎన్నికలతో పోల్చితే 2018 ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరిగింది. ప్రస్తుత ఎన్నికల్లో కూడా పోలింగ్ శాతం మరింతగా పెంచేందుకు ఓటర్లందరూ పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓటేయాలని ఎన్నికల యంత్రాంగం పిలుపునిచ్చింది.

జిల్లా వార్తలు

వైభవంగా మహాపుష్పాభిషేకం



స్వామికి పుష్పాభిషేకం కోసం తీసుకొచ్చిన పూలతో భక్తులు

ఖమ్మంగాంధీచౌక్: కార్తీక మాసం సందర్భంగా ఖమ్మంలోని ట్రంకు రోడ్డులో ఉన్న శ్రీ భ్రమరాంబ శ్రీ గుంటు మల్లేశ్వరసామి దేవస్థానంలో బుధవారం వైభవంగా మహాపుష్పాభికం నిర్వహించారు. స్వామి జన్మనక్షత్రమైన ఆరుద్ర సందర్భంగా తెల్లవారుజాము నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అభిషేకాల అనంతరం స్వామి వారికి సంప్రదాయ పద్ధతుల్లో మహాపుష్పాభిషేకం నిర్వహించారు. ఆలయ ఈఓ చందూరు రామకోటేశ్వరరావు పర్యవేక్షణలో అర్చకులు దాములూరి వీరభద్రరావు, దాములూరి కృష్ణశర్మ పూజలు జరిపించగా, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

హసన్‌పర్తి స్టేషన్‌లో హాల్ట్ రద్దు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం (భద్రాచలం రోడ్డు) రైల్వేస్టేషన్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ వరకు వచ్చివెళ్లే రైలుకు హసన్‌పర్తి స్టేషన్‌లో హాల్టింగ్ రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. కాజీపేట - బల్హార్షా మార్గంలోని ఉప్పల్ - హసన్‌పర్తి స్టేషన్ల వద్ద మూడో రైల్వేలైన్ పనులు జరుగుతున్న దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. వచ్చేనెల 9వ తేదీ వరకు ఈ నిర్ణయం అమల్లో ఉంటుందని, ప్రయాణికులు గమనించాలని సూచించారు.


ఏజెన్సీకి ఆర్టీసీ బస్సులు బంద్

భద్రాచలంటౌన్: భద్రాచలం ఏజెన్సీలోని ప్రాంతాలకు వెళ్లివచ్చే ఆర్టీసీ బస్సులను వచ్చే నెల 3వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు భద్రాచలం ఆర్టీసీ డిపో మేనేజర్ బి.రామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించాలని మావోయిస్టులు పిలుపునిచ్చిన నేపథ్యాన పోలీసుల సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. వచ్చే నెల 4వ తేదీ నుంచి బస్సులు యథావిధిగా రాకపోకలు సాగిస్తాయని ఆయన వివరించారు.

వన్నె తెచ్చిన నేతలు !

జిల్లాకు తొలి మంత్రిని అందించిన మధిర

- సీపీఎం శాసనసభాపక్ష నేతగా బోడేపూడి
- సీపీఐ రాజ్యసభా పక్షనేతగా నల్లమల.. సీఎల్పీ నేతగా భట్టి




శీలం సిద్ధారెడ్డి



బోడెపుడి వెంకటేశ్వరరావు





నల్లమల గిరిప్రసాద్



మల్లు భట్టివిక్రమార్క

మధిర: మధిర నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించిన పలువురు ఎమ్మెల్యేలు రాష్ట్రస్థాయిలో కీలక పదవులు చేపట్టారు. నియోజకవర్గానికి చెందిన శీలం సిద్ధారెడ్డి ఖమ్మం జిల్లా తొలి మంత్రిగా పనిచేసి ఖ్యాతి గడించారు. అలాగే, ఎమ్మెల్యేగా గెలిచిన బోడెపుడి వెంకటేశ్వరరావు సీపీఎం శాసనసభాపక్ష నేతగా వ్యవహరించారు. ఇక మల్లు భట్టి విక్రమార్క డిప్యూటీ స్పీకర్‌గా, చీఫ్‌విప్‌గా, కాంగ్రెస్ ఎన్నికల ప్రచార కమిటీలోపని చేసి ఇప్పుడు రాష్ట్ర కాంగ్రెస్ శాసనసభా పక్ష నేతగా కొనసాగుతున్నారు.

అన్ని పార్టీల్లోనూ కీలకపాత్ర

మధిర మండలం తొండల గోపవరం గ్రామానికి చెందిన నల్లమల గిరిప్రసాదరావు సీపీఐ జాతీయ కార్యదర్శిగా, రాజ్యసభా పక్ష నేతగా, స్వాతంత్ర్య సమరయోధుల స్క్రీనింగ్ కమిటీ చైర్మన్‌గా వ్యవహరించారు. 1962లో నల్లమల ఖమ్మం ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1988 నుంచి 1991 వరకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేయగా, 1992లో రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికై సీపీఐ రాజ్యసభ పక్ష నేతగా వ్యవహరించారు. 1996లో సీపీఐ జాతీయ ఉప ప్రధాన కార్యదర్శిగా స్వాతంత్ర్య సమరయోధుల స్క్రీనింగ్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. అలాగే, ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడు గ్రామానికి చెందిన శీలం సిద్ధారెడ్డి 1967లో ఎమ్మెల్సీగా ఉన్నారు. నాటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టి జిల్లా తొలి మంత్రిగా నమోదయ్యారు. అలాగే, 1985, 1989, 1994 ఎన్నికల్లో గెలుపొందిన బోడెపుడి వెంకటేశ్వరరావు 1989 నుంచి సీపీఎం శాసనసభా పక్ష నేతగా పనిచేశారు. 2009లో మధిర నుంచి తొలిసారి గెలిచిన మల్లు భట్టి విక్రమార్క ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చీఫ్ విప్‌గా, 2010లో డిప్యూటీ స్పీకర్‌గా పనిచేశారు. 2014లో రెండోసారి గెలిచాక భట్టి సీఎల్పీ ఉప నాయకుడిగా పని చేశారు. ప్రస్తుతం రాష్ట్ర కాంగ్రెస్ శాసనసభా పక్ష నేతగా కొనసాగుతున్న ఆయన మధిర స్థానం నుంచి మరోమారు పోటీపడుతున్నారు. ఇలా మధిర ప్రాంత నాయకులు జాతీయ, రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారు. ఇక ఎర్రుపాలెం గ్రామానికి చెందిన సర్దార్ జమలాపురం కేశవరావు నాడు నిజాం ప్రభువుకు వ్యతిరేకంగా పోరాడారు. మిరియాల నారాయణ గుప్తా, వాసిరెడ్డి వెంకటపతి తదితరులు జాతీయ స్థాయిలో ఖ్యాతి గడించారు.

క్రీడాకారులను అభినందించిన సీఈ



క్రీడాకారులతో సీఈ ప్రభాకర్‌రావు, అధికారులు

పాల్వంచ: ఇటీవల వరకు నాగర్‌కర్నూల్ జిల్లాలోని శ్రీశైలం హైడల్ స్టేషన్‌లో జరిగిన టీఎస్ జెన్‌కో ఇంటర్ ప్రాజెక్ట్ క్రీడా పోటీల్లో పాల్వంచలోని కేటీపీఎస్ 5, 6వ దశల క్రీడాకారులు ప్రతిభ కనబర్చారు. మహిళా కేటగిరి టెన్నీకాయిట్, టేబుల్ టెన్నిస్, చెస్, షటిల్ పోటీలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో నాగకల్యాణి, శ్రీవల్లి, పార్వతి, చిన్నారి, శ్రీలక్ష్మి, మహాలక్ష్మి బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను బుధవారం సీఈ ఎం.ప్రభాకర్‌రావు అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఈలు వి.వెంకటేశ్వర్లు, ఎస్ఏఓ డి.జార్జ్, స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ టి.వీరస్వామి, వైటీఎం కె.రాజు వెల్ఫేర్ ఆఫీసర్ బి.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిన్నటి వరకు ప్రచారం.. నేడు వృత్తిధర్మం!

సత్తుపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగిన డాక్టర్ మట్టా రాగమయి మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు అలుపెరగకుండా ప్రచారం నిర్వహించారు. ఇక బుధవారం ఉదయం పార్టీ శ్రేణులతో పలు అంశాలపై చర్చించిన ఆమె ఆ తర్వాత తన వృత్తిధర్మం నిర్వర్తించారు. స్వయానా డాక్టర్ అయిన రాగమయి తన క్లినిక్‌లో చికిత్స పొందుతున్న మహిళలను పరీక్షించి వైద్యసేవలందిస్తూ కనిపించారు. - సత్తుపల్లిటౌన్



మహిళను పరీక్షిస్తున్న డాక్టర్ రాగమయి

మహిళలే మహారాణులు!



ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం భారతదేశం. అయితే, ఆ ప్రజాస్వామ్యాన్ని కాపాడే బాధ్యత అందరిపైనా ఉంటుంది. ఇందుకోసం రాజ్యాంగం 18 ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కు కల్పించగా.. ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకుని మంచి చేసే నాయకులను ఎన్నుకోవాల్సిందే. కాగా, ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పది నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. దీంతో గురువారం జరిగే పోలింగ్‌లో మహిళా ఓటర్లు ఇచ్చే తీర్పు కీలకం కానుంది. ఈ మేరకు మహిళా ఉద్యోగులు 'సాక్షి'తో తమ అభిప్రాయాలు పంచుకున్నారు. – జూలూరుపాడు

జిల్లాల వారీగా ఓటర్ల వివరాలు

జిల్లా	మొత్తం ఓటర్లు	మహిళా ఓటర్లు
ఖమ్మం	12,16,796	6,27,553
భద్రాద్రి కొత్తగూడెం	9,66,439	4,94,650
మొత్తం	21,83,235	11,22,203

- ఉమ్మడి జిల్లా అంతటా మహిళా ఓటర్లే ఎక్కువ
- మంచి చేసే వారిని ఎన్నుకుంటామంటున్న అతివలు
- 'సాక్షి'కి అభిప్రాయాలు వెల్లడించిన మహిళా ఉద్యోగులు



ఓటు ఎంతో విలువైనది



ఓటు ఎంతో విలువైనది. ఓటు వేయకపోతే ఏం కాదులే అనే నిర్లక్ష్యాన్ని వీడాలి. అర్హులైన ప్రతీఒక్కరూ వినియోగించుకోవాలి. సరైన నాయకుడిని ఎన్నుకునేందుకు ఇదే మంచి మార్గం. ప్రతిఒక్కరూ నిర్భయంగా ఓటు వేయాలి.

–ఎం.శ్రీదేవి, ఆయుర్వేద వైద్యురాలు

ప్రలోభాలకు లొంగొద్దు



ఓటు దక్కించుకనేందుకు నాయకులు ప్రలోభాలతో ఎర వేస్తున్నారు. అలాంటి వాటికి ఓటర్లు లొంగిపోవద్దు. ప్రతీ ఓటరు విజ్ఞతతో ఆలోచించి ఎవరిని ఎన్నుకుంటే మంచిదనే నిర్ణయాన్ని తీసుకోవాలి. సరైన వ్యక్తికే ఓటు వేయాలి.

–సూరపనేని శాంతకుమారి, ఉపాధ్యాయురాలు

ఇదే వజ్రాయుధం



ఓటు అనేది వజ్రాయుధం వంటిది. ముఖ్యంగా మహిళలు చైతన్యవంతులు కావాలి. ఓటు వేయకపోతే సమాజానికి తీరని నష్టమే కాక ప్రజాస్వామినికి ప్రమాదం వాటిల్లుతుంది. అందుకే తప్పనిసరిగా ఓటుహక్కు వినియోగించుకోవాలి.

–గుగులోత్ శశికళ, ఫార్మసిస్ట్

నిస్వార్థపరులకే ఓటు



మంచి చేస్తాడని భావించే నిస్వార్థపరులనే ప్రజాప్రతినిధిగా ఎన్నుకోవాలి. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తాడనే నమ్మకం ఉన్నవారినే ఎంచుకోవాలి. ప్రతీ ఓటు ఎంతో విలువైందనే విషయాన్ని అందరూ గుర్తించాలి. –నిమ్మగడ్డ ఉమ, ఉపాధ్యాయురాలు

మార్పు కోసం తప్పదు



ప్రతీ పౌరుడు సమాజంలో మార్పు కోసం కృషి చేయాలి. ఇందులో భాగంగా ఓటరుగా నమోదైన అందరూ తప్పకుండా ఓటు వేయాలి. మనం ఒక్కరమే కదా అని నిర్లక్ష్యం వహించకుండా మంచి నాయకుడిని ఎన్నుకోవాలి.

–బి.సుకుమారి, స్టాఫ్ నర్స్

చైతన్యంతో ఓటు వేయాలి



ముఖ్యంగా మహిళలు, యువత చైతన్యంతో ఓటు వేయాలి. ఓటు హక్కు వినియోగించుకోకపోతే అసమర్థులు అందలమెక్కే ప్రమాదముందని తెలుసుకోవాలి. అందుకే నిర్లక్ష్యం చేయకుండా ఓటుహక్కు వినియోగించుకోవాలి.

–కె.లలిత, ఉపాధ్యాయురాలు

సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం । 30 । నవంబర్ । 2023



ఓటు వేద్దాం ఇలా..
పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తయిన నేపథ్యాన పోలింగ్ కేంద్రాల్లో అధికారుల విధులు, ఓటు ఎలా వేయాలనే అంశంపై కథనం 8లో



‘పొజిషన్’ మారేనా..?
జిల్లా కేంద్రంలో అంతర్భాగంగా ఉన్న రామవరం ప్రజలు పొజిషన్ పట్టాల(స్థిర నివాస సర్టిఫికెట్టు) కోసం ఎదురుచూస్తున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
33° / 20°
వాతావరణం
జిల్లాలో గురువారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రిపూట వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

కమనీయం.. రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం కమనీయంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపిక



ప్రదీప్‌ను అభినందిస్తున్న పరంధామరెడ్డి

కొత్తగూడెంటౌన్: వచ్చే నెలలో గుజరాత్‌లో జరిగే జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ములకలపల్లి మండలం పాతగంగారం గ్రామానికి చెందిన పి.ప్రదీప్ ఎంపికయ్యాడు. ఈనెల 27, 28 తేదీల్లో మహబూబాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చడంతో ప్రదీప్‌ను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కాగా, క్రీడాకారుడిని బుధవారం కొత్తగూడెంలో జిల్లా క్రీడా శాఖ అధికారి పి.పరంధామరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ సూపరింటెండెంట్ ఆర్.ఉదయ్‌కుమార్, సిబ్బంది తిరుమలరావు, లక్ష్మయ్య, ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి పుట్టా శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

నలుగురు ఓపీఓల సస్పెన్షన్

మణుగూరురూరల్: పినపాక నియోజకవర్గంలో ఎన్నికల విధులకు గైర్హాజరైన నలుగురు ఓపీఓలను రిటర్నింగ్ అధికారి ప్రతీక్ జైన్ బుధవారం సస్పెండ్ చేశారు. సస్పెన్షన్ సమయంలో కార్యస్థానం విడిచి వెళ్లరాదని ఆదేశించారు. వేటు పడిన వారిలో జేబీఎస్ ఇల్లెందు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.సి.శర్మ, పాల్వంచ మండలం సోములగూడెం ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ఎస్‌ఎంజే రాణి, దుమ్ముగూడెం మండలం గంగోలు ప్రాథమిక పాఠశాలకు చెందిన వి.కవిత, చర్ల మండలం చిన్నమిడిసిలేరు పాఠశాల ఉపాధ్యాయుడు శ్యామల సత్తిబాబు ఉన్నారు.

జలగం క్యాంపు ఆఫీస్‌లో సోదాలు



తనిఖీ చేస్తున్న స్క్వాడ్ అధికారులు

చుంచుపల్లి: ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ కొత్తగూడెం అసెంబ్లీ అభ్యర్థి జలగం వెంకటరావు క్యాంపు కార్యాలయంలో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఆఫీస్‌లో డబ్బులు పంపిణీ చేస్తున్నారని అందిన ఫిర్యాదు మేరకు అధికారులు క్యాంప్ ఆఫీస్‌కు చేరుకుని దాదాపు 40 నిమిషాల పాటు అణువణువూ సోదాలు చేశారు. అయితే కార్యాలయంలో ఎలాంటి నగదు దొరకలేదని అధికారులు తెలిపారు.

2న అండర్ 14 ఖో-ఖో ఎంపిక పోటీలు

నవభారత్: ఉమ్మడి ఖమ్మం జిల్లా అండర్ 14 బాలబాలికల ఖో-ఖో జట్టు ఎంపిక పోటీలను డిసెంబర్ 2వ తేదీన నిర్వహించనున్నట్లు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల డీఈఓలు ఈ.సోమశేఖరశర్మ, ఎం.వెంటేశ్వరాచారి తెలిపారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఈ పోటీలు ఉదయం 9గంటలకు మొదలవుతాయని పేర్కొన్నారు. 6నుంచి నుండి 9వ తరగతి చదువుతూ 1-1-2010 తర్వాత జన్మించిన వారు అర్హులని, పుట్టిన తేదీని ధృవీకరించే పత్రాలతో హాజరుకావాలని తెలిపారు. ఈమేరకు అర్హులైన విద్యార్థులు హాజరయ్యే పీఈటీలు పర్యవేక్షించాలని, పూర్తి వివరాలకు 80199 52592, 79897 31339 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సర్వం సన్నద్ధం

పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి
- కేంద్రాలకు చేరిన ఎన్నికల సామగ్రి
- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత
- ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకే పోలింగ్



కొత్తగూడెంలోని రామచంద్ర డిగ్రీ కళాశాల నుంచి పోలింగ్ సామగ్రిని తీసుకెళ్తున్న సిబ్బంది

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో గురువారం జరిగే పోలింగ్‌కు సర్వం సిద్ధం చేశారు. పినపాక నియోజకవర్గానికి మణుగూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి, ఇల్లందు నియోజకవర్గానికి సింగరేణి ప్రైమరీ స్కూల్, కొత్తగూడెం నియోజకవర్గానికి లక్ష్మీదేవిపల్లిలోని శ్రీరామచంద్ర కళాశాల నుంచి, అశ్వారావుపేట నియోజకవర్గానికి వ్యవసాయ కళాశాల, భద్రాచలం నియోజకవర్గానికి అక్కడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి పోలింగ్ సిబ్బందికి సామగ్రి అందజేయగా, వారి బుధవారం రాత్రికి సంబంధిత స్టేషన్లకు చేరుకున్నారు.

గంట ముందే పోలింగ్ పూర్తి

జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో మొత్తం 1098 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించిన 13 నియోజకవర్గాల్లో పోలింగ్ సమయాన్ని సాయంత్రం 4 గంటల వరకే పరిమితం చేయగా, అందులో జిల్లాలోని ఐదు నియోజకవర్గాలూ ఉన్నాయి. జిల్లాలో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకే పోలింగ్ ఉంటుంది. ఉదయం 5.30 గంటల నుంచి ఏజెంట్ల సమక్షంలో మాక్‌పోలింగ్ నిర్వహించనున్నారు. ఎన్నికల నిర్వహణ, పర్యవేక్షణకు ముగ్గురు సాధారణ పరిశీలకులు, ఇద్దరు వ్యయ పరిశీలకులు, మరో ఇద్దరు పోలీస్ అబ్జర్వర్లను ఎన్నికల సంఘం నియమించింది.

కేంద్రాల్లో సౌకర్యాల ఏర్పాటు..

జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో 181, గ్రామీణ ప్రాంతాల్లో 917 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, వాటిలో అన్ని రకాల సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకున్నారు. 320 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించారు. 659 పోలింగ్ కేంద్రాలకు లోపల, 269 పోలింగ్ కేంద్రాలకు వెలుపల వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశారు. నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా ఏర్పాట్లు చేశారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం కేంద్రాల వద్ద ర్యాంపులు, 750 వీల్‌చైర్లు ఏర్పాటు చేశారు. అంతేకాక జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో ప్రత్యేకంగా మహిళలు, దివ్యాంగులు, యువత, మోడల్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మూడు నియోజకవర్గాల్లో అభ్యర్థులు ఎక్కువ మంది ఉండగా రెండు బ్యాలెట్ల(ఈవీఎంలు)ను వినియోగించనున్నారు. కొత్తగూడెంలో 30, ఇల్లెందులో 20, పినపాకలో 18 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా పోలింగ్ ప్రక్రియ నిర్వహణకు 2,398 బ్యాలెట్ యూనిట్లు, 1,544 కంట్రోల్ యూనిట్లు, 1,540 వీవీ ప్యాట్లను అందుబాటులో ఉంచారు.

సిబ్బంది నియామకం ఇలా..

జిల్లాలో పోలింగ్ నిర్వహణకు 1,313 మంది పీఓలు, 1,313 మంది ఏపీఓలు, 2,626 మంది ఓపీఓలు, 306 మంది సూక్ష్మ పరిశీలకులను నియమించారు. ఎక్కడైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించడానికి నియోజకవర్గాని ముగ్గురు చొప్పున ఈసీఐఎల్ ఇంజనీర్లను సిద్ధంగా ఉంచారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పర్యవేక్షణకు 16 ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు, 15 స్టాటిస్టిక్ సర్వెలెన్స్, 21 వీఎస్‌టీ, 5 వీవీటీ, 5 అకౌంటింగ్ బృందాలను ఏర్పాటు చేశారు. ఇంకా 5 సహాయ వ్యయ పరిశీలకుల టీమ్‌లను నియమించారు. ఇక జిల్లాలో 5,421 మంది, ఇతర జిల్లాల నుంచి వచ్చిన 2,586 మంది ఉద్యోగుల కోసం ఈనెల 25 నుంచి పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను నిర్వహించారు.



భద్రాచలంలో ఏర్పాటుచేసిన యువ ఆదర్శ పోలింగ్ కేంద్రం

నిరంతర పర్యవేక్షణ..

ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేందుకు జిల్లాలో 24 గంటలూ పనిచేసేలా 14 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. జిల్లా సరిహద్దుతో పాటు, అంతర్రాష్ట్ర సరిహద్దులో పటిష్ట బందోబస్తుతో వాహనాలను తనిఖీ చేస్తున్నారు. చెక్‌పోస్టుల పర్యవేక్షణకు కలెక్టరేట్‌లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశారు. ఇక పోలింగ్ ప్రక్రియ నిర్వహణకు 138 కార్లు, 13 మినీ బస్సులు, 210 బస్సులు, 10 క్లోజ్డ్ కంటెయినర్లు ఏర్పాటు చేసి పోలింగ్ సిబ్బంది, మెటీరియల్‌ను ఆయా కేంద్రాలకు తరలించారు.

జంగ్ తెలంగాణ

ఏర్పాట్లు పూర్తయ్యాయి

జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. బుధవారం రాత్రి కలెక్టరేట్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఓటు వినియోగానికి పోల్‌స్లిప్పుతో పాటు ఎన్నికల సంఘం సూచించిన 15 కార్డుల్లో ఏదైనా ఒకటి వెంట తెచ్చుకోవాలని సూచించారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వెబ్‌కాస్టింగ్ నుంచి పోలింగ్ స్టేషన్లలో ఏర్పాట్లను పరిశీలించారు. సమావేశంలో డీపీఆర్‌ఓ ఎస్.



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆల

శ్రీనివాసరావు, ఎన్నికల విభాగం తహసీల్దార్ దారా ప్రసాద్ పాల్గొన్నారు.

బరిలో 95 మంది..

- జిల్లా వ్యాప్తంగా 9.60 లక్షల మంది ఓటర్లు
- నెల రోజులుగా సాగుతున్న ప్రచారం
- గెలుపు కోసం శ్రమించిన అభ్యర్థులు
- కొత్తగూడెం, భద్రాచలంలో త్రిముఖ పోరు
- ఇల్లెందు, పినపాకలో ఢీ అంటే ఢీ
- కీలకం కానున్న మహిళా ఓటర్లు



అభ్యర్థులు, ఓటర్ల వివరాలిలా..

నియోజకవర్గం	అభ్యర్థులు	ఓటర్లు
పినపాక	18	1,98,402
ఇల్లెందు	20	2,19,569
కొత్తగూడెం	30	2,43,118
అశ్వారావుపేట	14	1,55,961
భద్రాచలం	13	1,48,661
మొత్తం	95	9,65,711

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: నెల రోజుల కిందట నామినేషన్ల స్వీకరణ.. గత రెండు వారాలుగా ఊరూ వాడా హోరెత్తిన ప్రచారం.. ఓటర్లను ఆకట్టుకునేందుకు అష్టకష్టాలు పడిన అభ్యర్థులు.. వెరసి ఎన్నికల ప్రక్రియలో కీలక ఘట్టమైన ప్రచారం మంగళవారం సాయంత్రంతో ముగిసింది. ఇక అభ్యర్థుల భవితవ్యాన్ని తేల్చేలా ఓటర్లు నిర్ణయం తీసుకునే రోజు రానే వచ్చింది. గురువారం జరిగే పోలింగ్ ప్రక్రియకు ప్రభుత్వ యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది.

అదృష్టాన్ని పరీక్షించుకోనున్న 95 మంది..

గడిచిన ఐదేళ్లుగా కొనసాగిన పాలన.. రెండు నెలలుగా సాగుతున్న ఎన్నికల హంగామా పట్ల ఓటర్లు తమ నిర్ణయాన్ని నేడు ప్రకటించనున్నారు. జిల్లా వ్యాప్తంగా ఐదు అసెంబ్లీ సెగ్మెంట్లలో 95 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీరి గెలుపోటములు 9.65 లక్షల మంది ఓటర్లు నిర్ణయించనున్నారు. కొత్తగూడెంలో అత్యధిక మంది అభ్యర్థులు, ఓటర్లు ఉండగా భద్రాచలంలో అత్యల్ప మంది అభ్యర్థులు, ఓటర్లు ఉన్నారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది ఓటింగ్ శాతాన్ని మరింతగా పెంచేందుకు జిల్లా ఎన్నికల అధికారులు రెండు నెలలుగా అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారు. కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ పూర్తి చేశారు. క్రమం తప్పకుండా అవగాహన సదస్సులు నిర్వహించారు. మహిళలు, దివ్యాంగుల కోసం ప్రత్యేక పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు.

రెండు చోట్ల త్రిముఖ పోటీ..

కొత్తగూడెం, భద్రాచలం నియోజకవర్గాల్లో త్రిముఖ పోటీ నెలకొంది. కొత్తగూడెంలో బీఆర్‌ఎస్ నుంచి వనమా వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ మద్దతుతో సీపీఐ అభ్యర్థిగా కూనంనేని సాంబశివరావు, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తరఫున జలగం వెంకటరావు పోటీలో ఉన్నారు. వీరితో పాటు బీఎస్పీ నుంచి ఎర్రా కామేశ్, మరో ఇరవై మందికి పైగా స్వతంత్రులు బరిలో ఉన్నారు. నామినేషన్ల ప్రక్రియ మొదలైనప్పటి నుంచి వనమా, కూనంనేని, జలగం మధ్యనే ప్రధాన పోరు ఉంటుందనే చర్చ జరుగుతోంది. ముగ్గురు అభ్యర్థులు గెలుపు తమదే అనే ధీమాలో ఉన్నారు.

- భద్రాచలంలోనూ త్రిముఖ పోరు నెలకొంది. ఇక్కడ బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు తెల్లం వెంకట్రావు, పొదెం వీరయ్యకు దీటుగా సీపీఎం అభ్యర్థి కారం పుల్లయ్య కూడా ప్రచారంలో చెమటోడ్చారు. గతంలో ఈ నియోజకవర్గంలో సీపీఎం అనేకమార్లు విజయం సాధించడంతో ఇక్కడ కమ్యూనిస్టుల బలాన్ని తక్కువగా అంచనా వేయడానికి వీలు లేని పరిస్థితి నెలకొంది. స్థానికేతరుడైన పొదెం వీరయ్యతో ఈ నియోజకవర్గానికి ఒరిగేదేమీ లేదని, తనను గెలిపిస్తే అభివృద్ధి చేస్తానని తెల్లం చెబుతున్నారు. ప్రతిపక్షంలో ఉండడం వల్ల గతంలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి చేయలేదని, ఈసారి కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే తన మార్క్ పనితీరు చూపిస్తానని పొదెం హామీ ఇస్తున్నారు.
- ఇల్లెందులో బీఆర్‌ఎస్ నుంచి బానోత్ హరిప్రియ, కాంగ్రెస్ నుంచి కోరం కనకయ్య బరిలో ఉన్నారు. ఇక్కడ మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య కూతురు అనురాధతో పాటు సీపీఎం అభ్యర్థి దుగ్గి కృష్ణ సైతం పోటీ చేస్తున్నారు. అయితే ఇక్కడ బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్యనే ముఖాముఖి పోరు ఉంటుందని రాజకీయ పరిశీలకుల భావన.
- పినపాకలో మొత్తం 18 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. కానీ నువ్వా – నేనా అన్నట్టుగా బీఆర్‌ఎస్ అభ్యర్థి రేగా కాంతారావు, కాంగ్రెస్ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లు మధ్య తీవ్రమైన పోటీ నెలకొంది. ప్రభుత్వ వ్యతిరేకత మీదనే పాయం ఎక్కువగా నమ్మకం పెట్టుకోగా, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, గత ఐదేళ్లలో నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులు తనను గెలిపిస్తాయనే విశ్వాసం రేగాలో కనిపిస్తోంది.
- అశ్వారావుపేట నియోజకవర్గంలో మొత్తం 14 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటన తర్వాత ఇక్కడ ప్రతీ రోజు రాజకీయ సమీకరణలు మారుతూ వచ్చాయి. మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు ‘కారు’ ఎక్కడంతో బీఆర్‌ఎస్ శిబిరం బలపడినట్టుగా అనిపించింది. ఇదే సమయంలో ఈ ప్రాంతంపై పట్టున్న తుమ్మల వర్గం కాంగ్రెస్ అభ్యర్థి జారే ఆదినారాయణకు అండగా ఉండటంతో ఇక్కడ కూడా హోరాహోరీ పోరు నెలకొంది.

మహిళా ఓటర్లే కీలకం

జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లోనూ పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. దీంతో వారి మద్దతు ఎవరికి లభిస్తుందనేది ఈసారి ఎన్నికల్లో ఆసక్తికరంగా మారింది. ఈసారి ప్రధాన పార్టీలన్నీ మహిళా ఓటర్లను ఆకట్టునేందుకు వీలుగా గ్యాస్ సిలిండర్ ధర తగ్గింపుతో పాటు మహాలక్ష్మి, సౌభాగ్య లక్ష్మి వంటి పథకాలను ప్రకటించాయి.

ఓటు అమ్ముకుంటే ఆగమే !

- తాయిలాలు భవితను మార్చవు
- ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి
- నీతిగా ఓటు వేయండి.. పనిమంతులకే పట్టం కట్టండి



ఇల్లెందురూరల్: ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైంది. సమాజ గతిని మార్చే ఓటును ప్రతి ఒక్కరూ నిజాయితీగా వినియోగించుకోవాలి. సమర్థులను ఎన్నుకుంటేనే ప్రజా సమస్యలపై చట్టసభల్లో పోరాడుతారు. మంచి పాలన అందాలంటే ప్రతినిధులు ఉత్తములై ఉండాలి. ‘నేనున్నా’ అనే భరోసా కలిగించేలా పనిచేసే వారినే ఎన్నుకోవాలి తప్ప ఆయా పార్టీల వారు ఇచ్చే తాయిలాలకు ఆశపడి ఓటు అమ్ముకుంటే ఇక ఐదేళ్ల పాటు ప్రజలకు సమస్యలు తప్పవు. ఆ తర్వాత ప్రశ్నించే అవకాశం కూడా ఉండదు.

డబ్బుంటేనే రంగంలోకి..?

ప్రస్తుతం ఎన్నికలను డబ్బులు శాసిస్తున్నాయి. ఎన్నికల పోరు మొదలు కాగానే డబ్బున్నోళ్లే రంగంలోకి దిగుతున్నారు. కార్యకర్తలు, ప్రజలకు మందు, విందు కోసం విచ్చలవిడిగా ఖర్చు చేస్తుంటారు. చివరకు ఓటుకు రూ.500 నుంచి రూ.1000 వరకు ఇచ్చి కొనుగోలు చేస్తుంటారు. తీరా గెలిచాక ఇక ప్రజల గురించి పట్టించుకునే నాథులే ఉండరు. అందుకే ఎన్నికల్లో నోటుకు ఓటు వేయొద్దంటూ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. స్వచ్ఛంద సంస్థలు సైతం ముమ్మరంగా ప్రచారం చేస్తున్నాయి.

అంతకంటే హీనమా..

ఆయా పార్టీల అభ్యర్థులు ఓటర్లను యాచకుడి కంటే హీనంగా లెక్కకడుతున్నారు. ఓ అభ్యర్థి ఓటుకు రూ.1000 ఇచ్చినా.. గెలిస్తే ఐదేళ్లు.. 1,825 రోజులు అధికారంలో ఉంటారు. అంటే రోజుకు 54 పైసల చొప్పున ఇస్తారు. ప్రస్తుత రోజుల్లో యాచకుడు సైతం రూ.1 ఇస్తే తీసుకోవడం లేదు. ఇక ఓటర్లను యాచకుడి కంటే హీనంగా అభ్యర్థులు చూస్తున్నారని సామాజిక మాధ్యమాల్లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మహిళా ఓటర్లు 51శాతం..

ఉమ్మడి జిల్లాలో మొత్తం ఓట్లు 21,83,235 ఉంటే అందులో 51 శాతం మంది మహిళలు ఉన్నారు. గెలుపోటములను శాసించే సత్తా వారికే ఉంది. ఓట్లు వచ్చాయంటే మహిళా ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఎత్తులు వేస్తారు. మహిళా సంఘాలకు ఇంత మొత్తం అని బేరాలు చేస్తారు. ఇంకా చీరలు, ఇతర వస్తువులు పంచుతారు. ఆయా పార్టీలు ఇచ్చే కానుకలకు ఆశ పడకుండా మంచి వారిని ఎన్నుకుంటే ఆ తర్వాత మన జీవితాలు బాగుంటాయని గ్రహించాలి. నానాటికీ పెరుగుతున్న నిత్యావసర ధరల గురించి రాజకీయ నాయకులను నిలదీయాలి. జిల్లాలో ఒకే ఒక్క మహిళా పోలీస్‌స్టేషన్ ఉంది. సమాజంలో మహిళలపై అఘాయిత్యాలు నానాటికీ పెరుగుతున్నాయి. వీటి కట్టడికి ఎలాంటి చర్యలు తీసుకుంటారో ప్రశ్నించండి.

యువత ఆలోచించాలి..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 18 – 19 ఏళ్ల వయసు గల ఓటర్లు 76, 886 మంది 20 – 29 ఏళ్ల మధ్య వారు 4,31,478, 30 – 39 మధ్య వారు 6,11,935, 40 – 49 మధ్య వయసు వారు 4,26,408 మంది ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం ఓటర్లు 21,83,235 మంది కాగా, 50 ఏళ్ల లోపువారు 15,46,707 మంది. అంటే వీరి ఓట్లే నిర్ణయాత్మకంగా ఉంటాయి. యువత ఆలోచించి ఉత్తములను ఎన్నుకుంటే ప్రజాస్వామ్యానికి రక్షణ ఉంటుంది. యువత భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలంటే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడాలి. ఓట్లు అడిగే నాయకులను ఈ మేరకు నిలదీయాలి. ఓటుకు డబ్బు, క్రీడా కిట్లు కాకుండా గెలిచాక ఏం చేస్తారో హామీ తీసుకోండి. ఆ తర్వాత మాటపై నిలబడకుంటే నిలదీయండి.

ముమ్మరంగా పోలీసుల కూంబింగ్



భద్రాచలంటౌన్: ఎన్నికలను బహిష్కరించాలని పిలుపునిచ్చిన మావోయిస్టులు.. చర్ల మండలంలోని పూసుగుప్ప గ్రామంలో మంగళవారం ధాన్యం సేకరణకు వెళ్లిన లారీ నుంచి ధాన్యం దింపి, లారీని తగలబెట్టారు. దీంతో అప్రత్తమైన పోలీసులు, కేంద్ర, సీఆర్పీఎఫ్, స్పెషల్ పార్టీ బలగాలతో ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో ముమ్మరంగా కూంబింగ్ నిర్వహిస్తూ అడవులను జల్లెడపడుతున్నారు. సరిహద్దు పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఎన్నికల సిబ్బందికి రాత్రి సమయాల్లో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు. భద్రాచలం నియోజకవర్గవ్యాప్తంగా పోలింగ్ కేంద్రాలు పోలీస్ నిఘా నీడలో ఉన్నాయి. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్పీ డాక్టర్ వినీత్, భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ భద్రతా చర్యలను పర్యవేక్షిస్తున్నారు.

ఎన్నికల నిర్వహణకు పటిష్ట బందోబస్తు

ఎస్పీ డాక్టర్ వినీత్ వెల్లడి

చర్ల: జిల్లాలో శాసన సభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని, ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురి కాకుండా ఓటు వేయాలని ఎస్పీ డాక్టర్ జి.వినీత్ పిలుపునిచ్చారు. మండలంలోని మావోయిస్టు ప్రాబల్య గ్రామాలైన ఉంజుపల్లి, తిప్పాపురంలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం చర్ల పోలీస్‌స్టేషన్‌లో ఓఎస్‌డీ సాయి మనోహర్, భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 15 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకమైనవిగా గుర్తించామని తెలిపారు. భద్రాచలం, పినపాక, ఇల్లెందు నియోజకవర్గాల్లో 226 పోలింగ్ కేంద్రాలు మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాల్లో ఉన్నాయని, వాటి పరిధిలో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టామని చెప్పారు. ఎన్నికల విధుల కోసం హోంగార్డులతో కలిపి 1,500 మంది జిల్లా పోలీసులు, 22 కంపెనీలకు చెందిన 1,760 మంది కేంద్ర బలగాలు, తెలంగాణా స్టేట్ స్పెషల్ పోలీస్ విభాగానికి చెందిన 20 సెక్షన్ల పోలీసులతో పాటు అటవీ, అగ్ని మాపక శాఖలకు చెందిన 957 మందిని వినియోగిస్తున్నట్లు వివరించారు. మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాల్లో ఇప్పటికే సీఆర్‌పీఎఫ్, కోబ్రా, గ్రేహౌండ్స్, స్పెషల్ పార్టీ బలగాలు కూంబింగ్ చేస్తున్నాయని తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి జిల్లాలో రూ. 3,20,53,240 నగదు, రూ. 22,42,630 విలువైన మద్యం, రూ. 94,03,500 విలువైన గంజాయి, రూ. 1,45,000 విలువైన వెండి వస్తువులు, రూ 5,30,000 విలువైన పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని వివరించారు. ఓటర్లకు పోలింగ్ కేంద్రాలు సమీపంలో ఉండాలనే ఉద్దేశంతో మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాలైన చర్ల, దుమ్ముగూడెం, గుండాల మండలాల్లోనూ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సమావేశంలో సీఐలు బి.రాజగోపాల్, బి.అశోక్, టి.రాజువర్మ, ఎస్సైలు నర్సిరెడ్డి, టీవీఆర్ సూరి పాల్గొన్నారు.



ఉంజుపల్లిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ వినీత్ తదితరులు

ధాన్యం లారీ పరిశీలన

మండలంలోని పూసుగుప్ప సమీపంలో మావోయిస్టులు దగ్ధం చేసిన ధాన్యం లారీని ఎస్పీ వినీత్ పరిశీలించి ప్రత్యక్ష సాక్షుల నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉనికి చాటుకునేందుకే మావోయిస్టులు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. సామాన్య పౌరులుగా సైకిళ్లపై వచ్చిన కొందరు ఈ ఘాతుకానికి పాల్పడినట్లు సమాచారం అందిందని తెలిపారు. మావోయిస్టులు ఇలాంటి దుశ్చర్యలు మానుకోవాలని, లేదంటే సరైన రీతిలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

పోలింగ్ సామగ్రి తరలింపు

కొత్తగూడెంరూరల్: జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు సంబంధించి లక్ష్మీదేవిపల్లి మండలంలోని రామచంద్రా డిగ్రీ కళాశాల నుంచి బుధవారం పోలింగ్ సామగ్రిని ప్రత్యేక బస్సుల ద్వారా తరలించారు. పంపిణీ కార్యక్రమాన్ని ఎన్నికల పరిశీలకులకు కమల్‌కిషోర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ వినీత్ మాట్లాడుతూ.. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల పరిధిలో ఏర్పాటుచేసిన 1,098 పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రిని పంపించామని చెప్పారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. పోలీసులు బాధ్యతాయుతంగా పని చేయాలని, ప్రతీ పౌరుడు ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు.



రామచంద్ర కళాశాల వద్ద సిబ్బంది కోలాహలం

క్లుప్తంగా

సంత వ్యాపారులను హెచ్చరించిన మావోయిస్టులు!

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని అటవీప్రాంత గ్రామాల్లో నిర్వహించే సంతలో పాల్గొనే, మండలానికి చెందిన వ్యాపారులను బుధవారం ఉదయం మావోయిస్టులు అడ్డగించి హెచ్చరించినట్టు సమాచారం. గొల్లపల్లి సంతకు వెళ్తున్న మండలంలోని లక్ష్మీనగరం, పెద్ద నల్లబల్లి, కట్టుకాలువ, గౌరారం గ్రామాలకు చెందిన సుమారు 25 మంది వ్యాపారులను తాళ్లగూడెం–గొల్లపల్లి గ్రామాల మధ్య ఉన్న అటవీప్రాంతంలో మావోయిస్టులు అడ్డగించారు. బూరుగులంక సంతకు రానందుకు తీవ్రంగా హెచ్చరించారు. బేస్‌క్యాంపులకు సరుకులు సరఫరా చేయవద్దని హెచ్చరించారు.

నగదు సీజ్

పాల్వంచ: ఇంట్లో నిల్వ ఉంచిన నగదును బుధవారం పోలీసులు సీజ్ చేశారు. స్థానికుల కథనం ప్రకారం.. ఎన్నికల కోసం పంపిణీ చేసేందుకు మండల పరిధిలోని నాగారంలో వి.శ్రీనివాసరావు ఇంట్లో నగదు తెచ్చి ఉంచారనే సమాచారంతో పోలీసులు తనిఖీ చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా ఉంచిన రూ.7.70 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు.

మద్యం స్వాధీనం

భద్రాచలంటౌన్: పట్టణంలో అక్రమంగా మద్యం విక్రయాలు నిర్వహిస్తున్న ఓ మహిళపై పట్టణ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. చర్ల రోడ్డులో బెల్టు షాపు నిర్వహిస్తున్న జి.అరుణ వద్ద నుంచి 3 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ మధు ప్రసాద్ తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

కామేపల్లి: ఓ ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టిన ఘటనలో వ్యక్తి మృతి చెందాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లికి చెందిన బానోత్ సురేశ్ (30) బుధవారం రాత్రి ఖమ్మం నుంచి ఇల్లెందు వైపు వెళ్తున్నాడు. కామేపల్లి మండలం మద్దిగూడెం సమీపాన ఎదురుగా వచ్చిన లారీ ఢీకొనడంతో తీవ్ర గాయాల పాలైన సురేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు.

15 ఎకరాల చెరుకు తోట దగ్ధం



రాజేశ్వరపురంలో దగ్ధమైన చెరుకు తోట


నేలకొండపల్లి: ప్రమాదవశాత్తు చెరుకు తోట దగ్ధమైన ఘటన మండలంలో బుధవారం చోటు చేసుకుంది. మండలంలోని రాజేశ్వరపురంలో నెల్లూరి రామకృష్ణ, వీరవెల్లి సత్యనారాయణ, మండల నాగేశ్వరరావుకు చెందిన చెరుకు తోట పక్కన ఓ రైతు వరికొయ్య కాలు తగలబెడుతుండగా నిప్పురవ్వలు చెరుకు తోటపై పడ్డాయి. దీంతో దాదాపు 15 ఎకరాల చెరుకు తోట అగ్నికి ఆహుతైంది. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక శాఖ సిబ్బంది చేరుకున్నా తోట వద్దకు రహదారి లేకపోవడంతో మంటలను అదుపు చేసేందుకు సాధ్యం కాలేదు. చేసేదేం లేక రైతులు కాల్వ నీటిని బిందెలతో తీసుకొచ్చి సరిహద్దు పొలాలను తడిపి మంటలు వ్యాపించకుండా అరికట్టారు.

ప్రభుత్వ ఉపాధ్యాయురాలికి గాయాలు

ఖమ్మంక్రైం: ఖమ్మం నగరంలోని ప్రకాష్‌నగర్ బ్రిడ్జి వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలికి గాయాలయ్యాయి. రాపర్తినగర్‌కు చెందిన వేమిరెడ్డి విజయలక్ష్మి నేలకొండపల్లి మండలంలోని ఆరెగూడెం ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆమె తన ద్విచక్రవాహనంపై ఉదయం 8.30 గంటల సమయాన విధులకు వెళ్తుండగా.. ప్రకాష్‌నగర్ బ్రిడ్జి వద్ద ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. దీంతో ఆమెను ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు.

మొబైల్ టవర్‌కు నిప్పంటించిన మావోయిస్టులు

చర్ల: వరుస విధ్వంసాలకు పాల్పడుతున్న మావోయిస్టులు.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతెవాడ జిల్లాలో ఓ మొబైల్ టవర్‌కు మంగళవారం అర్ధరాత్రి నిప్పంటించి దగ్ధం చేశారు. జిల్లాలోని మలేవాహి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ గ్రామంలోని మొబైల్ టవర్‌కు వద్దకు వచ్చిన మావోయిస్టులు జనరేటర్‌తో పాటు కంట్రోల్ బోర్డు ప్యానెళ్లకు నిప్పంటించారు. ఆ తర్వాత కరపత్రాలు, పోస్టర్లను అతికించారు. డిసెంబర్ 2 నుంచి 8 వరకు పీఎల్‌జీఏ వారోత్సవాలు నిర్వహించాలని పోస్టర్ల ద్వారా పిలుపునిచ్చారు. సమాచారం అందుకున్న మలేవాహి పోలీసులు బుధవారం అక్కడికి చేరుకుని కరపత్రాలను తొలగించడంతో పాటు ఘటనకు సంబంధించిన వివరాలను స్థానికుల నుంచి అడిగి తెలుసుకున్నారు. మూడు రోజుల క్రితం ఇదే జిల్లాలో తారు మిక్సింగ్ ప్లాంట్‌తో పాటు 16 వాహనాలను కూడా దగ్ధం చేసిన విషయం తెలిసిందే.

పామాయిల్ గెలలు 

టన్ను ధర	రూ.12,196

ఓటు ఇలా వేద్దాం..



ఓటు వజ్రాయుధం. సరైన వ్యక్తిని ఎన్నుకునేందుకు రాజ్యాంగం ఇచ్చిన హక్కు. దాన్ని సద్వినియోగం చేసుకుంటే ఐదేళ్లు మనల్ని ఆ వ్యక్తి సరిగ్గా పాలిస్తాడు. ఆశలు, ప్రలోభాలకు గురై దుర్వినియోగం చేసుకుంటే మన హక్కును మనమే కాలరాసుకున్నట్లు. నేడు (గురువారం) పోలింగ్. ఓటు హక్కును ఎలా వినియోగించుకోవాలి? పోలింగ్ కేంద్రంలోకి వెళ్లాక ఏం చేయాలి? అక్కడ అధికారులెవరు ఉంటారు? ఈవీఎంపై ఎలా ఓటు వేయాలి? అనే అంశాలను ఒక్కసారి చూద్దాం.

– సాక్షి నెట్‌వర్క్

12 కార్డుల్లో ఏదో ఒకటి..



పోల్ చిట్టీల పంపిణీ జరగకపోయినా నేరుగా పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేయొచ్చు. బీఎల్‌ఓలు పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉంటారు. అక్కడ బీఎల్‌ఓలను కలిసి పోల్ చిట్టీలు తీసుకుని ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. ఓటరుకార్డు లేకపోతే.. పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, ఫొటోతో ఉన్న సర్వీస్ గుర్తింపు కార్డు, బ్యాంకు, పోస్టాఫీస్ పాస్‌బుక్, పాన్‌కార్డు, ఆర్‌జీఐ జారీ చేసిన స్మార్ట్‌కార్డు, ఫొటోతో కూడిన పెన్షన్ కార్డు, ఆధార్‌కార్డు, ఉపాధి హామీ జాబ్‌కార్డు, ఎన్‌ఆర్‌ఐలు అయితే పాస్‌పోర్టు చూపించాల్సి ఉంటుంది.

పోలింగ్ కేంద్రంలోకి వీరికి మాత్రమే అనుమతి..

- ప్రిసైడింగ్ అధికారి ఒకసారి ఎంతమంది ఓటర్లను లోనికి అనుమతిస్తే.. వారు మాత్రమే రావాల్సి ఉంటుంది.
- పోలింగ్ అధికారులు, ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది
- ఎన్నికల సంఘం అనుమతించిన వ్యక్తులు.
- అభ్యర్థులు, వారి ఏజెంట్లు, పోలింగ్ ఏజెంట్లు.
- ఓటు వేయడానికి వచ్చినవారు, చంకన ఎత్తుకున్న పిల్లలు.
- అంధులు, వృద్ధులకు తోడుగా వచ్చినవారు.
- రిటర్నింగ్ అధికారి, ప్రిసైడింగ్ అధికారి, ప్రత్యేక పరిస్థితుల్లో నియమించిన వ్యక్తులు మాత్రమే పోలింగ్ రోజు కేంద్రంలోకి వెళ్లే అవకాశం ఉంటుంది.
- ఈనిబంధనలు అతిక్రమించిన వారిపై అధికారులు చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.





ఇవి వద్దు..

పోలింగ్ కేంద్రంలోకి ఓటర్లు సెల్‌ఫోన్లు, కెమెరాలు, ల్యాప్‌టాప్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకెళ్లకూడదు. సెల్ఫీలు తీసుకోవడం కూడా నేరం.



ఇలా చేయొద్దు..

మీరు ఈవీఎంలో ఒక బటన్ నొక్కిన తర్వాత మరో బటన్ నొక్కొద్దు. దీని వల్ల మీ ఓటు నమోదు కాదు. వృథా అవుతుంది. అందుకని ఒకసారి మాత్రమే బటన్ నొక్కి ఓటు హక్కును వినియోగించుకోవాలి.





బ్యాలెట్‌లో నోటా అనే ఆప్షన్ కూడా ఉంటుంది. మీకు పోటీలో నిలిచిన ఏ పార్టీ అభ్యర్థి నచ్చకపోయినా నోటా ఎదురుగా ఉన్న బటన్ నొక్కి ఓటు హక్కును వినియోగించుకోవచ్చు.

1 ఓటు హక్కు ఉన్న వారు మీకు కేటాయించిన పోలింగ్‌స్టేషన్‌కు వెళ్లేటప్పుడు కచ్చితంగా ఓటరు స్లిప్‌తోపాటు గుర్తింపుకార్డు వెంట తీసుకెళ్లాలి. ఒకవేళ గుర్తింపు కార్డు లేకపోతే ఎన్నికల సంఘం సూచించిన 12 గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి వెంట తీసుకెళ్లాలి. కేంద్రంలోని పోలింగ్ బూత్ వద్ద క్రమశిక్షణగా క్యూలో నిలబడి ఉండాలి.

2 బూత్‌లోపలికి వెళ్లాక మొదట మొదటి పోలింగ్ అధికారి వద్ద మీ పేరు, క్రమసంఖ్యను తెలపాలి. ఆయన తన వద్ద ఉన్న ఓటరు లిస్టులో ఓటర్ ఐడీ, పేరు, సీరియల్ నంబర్ చెక్‌చేసి నిర్ధారిస్తారు. మీ వివరాలను అందరికీ తెలిసేలా చెబుతారు. పక్కనే ఉన్న వివిధ పార్టీల అభ్యర్థుల తరఫున ఉండే పోలింగ్ ఏజెంట్లు ఆ వివరాలను తమ వద్ద ఉన్న ఓటరు లిస్టులో చెక్ చేసుకుంటారు. ఇక్కడ ఏదైనా తేడా వస్తే ఏజెంట్లు అభ్యంతరం తెలిపే అవకాశం కూడా లేకపోలేదు.

3 ఆ తర్వాత రెండో పోలింగ్ అధికారి వద్దకు వెళ్లాలి. అతను మీ ఎడమ చేతి చూపుడు వేలి గోటిపై సిరా చుక్క అద్దుతారు. మూడో పోలింగ్ అధికారి వద్దకు వెళ్లాలి. అక్కడ ఆయన ఓటర్ స్లిప్ తీసుకుని అప్పటికే ఓటింగ్‌కు సిద్ధం చేసిన ఈవీఎం బ్యాలెట్ యూనిట్‌ను కేటాయిస్తారు. రహస్యంగా ఉంచేందుకు ప్రత్యేక ఏర్పాట్లలో ఈవీఎం ఉంటుంది.

4 మీకు కేటాయించిన ఈవీఎం యూనిట్ దగ్గరికి వెళ్లాలి. అక్కడున్న ఈవీఎం బ్యాలెట్‌లో పోటీలో ఉన్న అందరి అభ్యర్థుల ఫొటోలు, గుర్తులు వరుస క్రమంలో ఉంటాయి. వాటిని గమనించి నచ్చిన పార్టీ ఎదురుగా గల బటన్‌ను గట్టిగా నొక్కాలి. రెడ్ లైట్ రావడంతోపాటు బీప్ సౌండ్ వస్తుంది. అప్పుడు మీ ఓటు వినియోగించుకున్నట్లు అర్థం. అదే సమయంలో పక్కన ఉన్న వీవీ ప్యాట్‌లో మీరు ఏ గుర్తుకు ఓటు వేశారో ఆ గుర్తు కనిపిస్తుంది. దాన్ని కూడా గమనించి మీరు వేసిన ఓటు సరిగ్గా నమోదైందా.. లేదా అనేది నిర్ధారించుకోవచ్చు.

5 అక్కడి నుంచి మీకు కేటాయించిన ఎగ్జిట్ దారి గుండా బయటికి వెళ్లాలి. ఎవరికి ఓటు వేశారో మీ అంతరాత్మకు మాత్రమే తెలియాలి. బయటికి చెప్పొద్దు.

ఓటు.. రకాలు..

సాధారణ ఓటర్లతో పాటు ప్రాక్సీ ఓటర్లు ఓటువేస్తారు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో టెండర్ ఓటు, చాలెంజ్ ఓటు కూడా ఉంటుంది. – సాక్షి నెట్‌వర్క్

ప్రాక్సీ ఓటింగ్

కొన్ని రకాల సర్వీసు ఓటర్లనే ప్రాక్సీ ఓటర్లని అంటారు. భద్రతా బలగాలు, రక్షణ రంగాల్లో పనిచేసే వారికి ప్రాక్సీ విధానం ద్వారా ఓటేసే అవకాశం ఉంటుంది. ఓటరు స్థానికంగా లేనందున వారి తరఫున ఒక ప్రతినిధిని ఓటు సేందుకు అధికారులు అనుమతిస్తారు. వీరిని క్లాసిఫైడ్ సర్వీస్ ఓటరుగా గుర్తిస్తారు. నియోజక వర్గం, పోలింగ్ బూత్ పరిధిలోని ప్రాక్సీ ఓటరు వివరాలపై ముందే ఆర్‌ఓ ద్వారా ప్రిసైడింగ్ అధికారికి సమాచారం ఉంటుంది. సర్వీసు ఓటరు తరఫున వచ్చే ప్రాక్సీ ఓటరు ఆ పోలింగ్ బూత్ పరిధిలోని మిగతా ఓటర్ల మాదిరిగానే ఓటు వేస్తారు. ఆ ఓటరు కూడా అందరిలాగే ఈవీఎంపైనే ఓటు వేయాల్సి ఉంటుంది. అయితే సాధారణ ఓటరుకు చూపుడువేలుకి సిరాచుక్క పెడితే.. ప్రాక్సీ ఓటరుకు మధ్య వేలికి చుక్క పెడతారు. ఆయన ఓటు వినియోగించుకున్నప్పుడు అందరిలాగే చూపుడు వేలికి చుక్క పెడతారు. అయితే ప్రాక్సీ ఓటరు తన ఓటు కాక ఒకరికి మాత్రమే ప్రాక్సీగా ఓటు వేయడానికి అవకాశం ఉంటుంది.

టెండర్ ఓటు...

కొన్ని సందర్భాల్లో ఓటరు ఓటేయడానికి వచ్చేసరికి అతని ఓటు ఇంకెవరో వేసి వెళ్లిన సందర్భాలు ఉంటాయి. అలాంటి సందర్భంలో సదరు ఓటరు వివరాలు ప్రిసైడింగ్ అధికారి పరిశీలిస్తారు. అతను వాస్తవంగా ఓటు వేయలేదని నిర్ధారణకు వస్తే అతనికి ఈవీఎం ద్వారా కాకుండా బ్యాలెట్ పేపరు ద్వారా ఓటు వసేందుకు అవకాశం కల్పిస్తారు. దీన్నే టెండర్డు ఓటు అంటారు. ఇందుకోసం ప్రతి పోలింగ్ బూత్‌కు 20 చొప్పున బ్యాలెట్ పేపర్లు అందుబాటులో ఉంచుతారు. ఇవి బీయూపైన అమర్చిన వాటిలాగే ఉంటాయి. ఆ బ్యాలెట్‌ను తీసుకుని ఓటరు కంపార్ట్ మెంట్‌లోకి వెళ్లి ఓటువేసి ఆ పత్రాలు కవర్లో పెట్టి ప్రిసైడింగ్ అధికారికి అందజేయాల్సి ఉంటుంది. పత్రం వెనుక ఇంక్‌తో టెండర్డ్ బ్యాలెట్ అని అధికారులు రాస్తారు.

చాలెంజ్ ఓటు

ఓటరు గుర్తింపు విషయంలో అధికారులకు సందేహం కలిగినా, ఏజెంట్లు అభ్యంతరం చెప్పినా సదరు ఓటరు తన గుర్తింపును చాలెంజ్‌చేసి రుజువు చేసుకోవాలి ఉంటుంది. ఉదాహరణకు ఒకవ్యక్తి ఓటేయడానికి వచ్చినప్పుడు అతని పేరు తప్పు చెబుతున్నాడని ఏజెంట్ అభ్యంతరం చెపితే ఓటరు, ఏజెంట్‌ను ప్రిసైడింగ్ అధికారి వద్దకు పంపుతారు. అభ్యంతరం చెప్పి ఏజెంట్ నుంచి రూ.2 చాలెంజ్ ఫీజుగా తీసుకుంటారు. అప్పుడు ఓటరు వద్ద ఉన్న ఇతర గుర్తింపు వివరాలు అధికారులు పరిశీలిస్తారు. అప్పటికీ సంతృప్తి చెందకపోతే స్థానిక బీఎల్‌ఓను పిలిచి అతను స్థానిక ఓటరా.. కాదా అన్న విషయంతోపాటు పేరు, తండ్రి పేరు తదితర వివరాలు తెలుసుకుంటారు. అతను స్థానిక ఓటరై జాబితాలో ఉన్న పేరు కరెక్ట్ అయితే వయస్సు, తండ్రిపేరు, చిరునామా లాంటి విషయాల్లో తేడా ఉన్న పెద్దగా పట్టించుకోరు. అప్పుడు ఏజెంట్, ఓటరు ఇద్దరిలో ఎవరి వాదన సరైందని తేలితే వారిని వదిలి మిగతా వారికి ప్రిసైడింగ్ అధికారి మొదటిసారి హెచ్చరిక జారీచేస్తారు. లేదా ఏజెంట్, ఓటరును అక్కడే ఉండే పోలీసులకు అప్పగించవచ్చు. అయితే ఏజెంటు పదేపదే చాలెంజ్‌చేస్తే అతనిని ప్రిసైడింగ్ అధికారి బయటకు పంపే అధికారం ఉంటుంది.

తొలుత మాక్ పోలింగ్..

పోలింగ్ కంటే గంట ముందు మాక్ పోలింగ్ నిర్వహిస్తారు. ఉదయం 6 గంటలకు పోలింగ్ కేంద్రంలో పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ జరుపుతారు. తొలుత పోలింగ్ అధికారి కంట్రోల్ యూనిట్‌లో సున్నా చేసి ఏజెంట్లకు చూపిస్తారు. ఆ తర్వాత పోలింగ్ కేంద్రంలో ఉండే ఏజెంట్లు 50 ఓట్లు వేసిన తర్వాత వారి ఎదుటే లెక్కిస్తారు. అందులో ఎవరు ఎన్ని ఏ గుర్తుకు వేశారనేది ఏజెంట్లకు స్పష్టం చేస్తారు. వాటన్నింటిని క్లియర్ చేసి, ధ్రువీకరణ పత్రం తీసుకుని, నిజమైన పోలింగ్ ప్రారంభిస్తారు. ఒకవేళ ఏజెంట్లు ఎవరూ రానిపక్షంలో ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం నడుచుకుంటారు.

నియోజకవర్గ జాబితాలో మీ పేరు ఉందా..

మీరు ఓటు వేయడానికి పోలింగ్ స్టేషన్‌కు వెళ్లే ముందు, మీ నియోజకవర్గ ఎన్నికల జాబితా లో మీ పేరు ఉందో లేదో సరిచూసుకోవాలి. మీ పేరు ఎలక్టోరల్ రోల్‌లో లేకుంటే మీ వద్ద ఓటరు ఐడీ కార్డు ఉన్నా ఓటు వేసేందుకు అవకాశం ఉండదు.

సమస్య ఎదురైతే...

ఎవరైనా దురుసుగా ప్రవర్తించడం, లేదా ఎవరైనా ఓట్లు అడగడం, ఎగ్జిట్ పోల్స్ నిర్వహించడం లేదా మీ పేరుపై ఎవరైనా ఓటు వేసినట్లు తెలిస్తే తక్షణమే పోలింగ్ స్టేషన్‌లోని అధికారులకు సమాచారం ఇవ్వాలి. వారు మీకు సహాయం చేస్తారు. ఓటర్ హెల్ప్ లైన్‌కు కాల్ చేసి లేదా సమీపంలోని ఎన్నికల కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేయవచ్చు.



ఖమ్మం నుంచి పోలింగ్ సామగ్రితో వెళ్తున్న ఉద్యోగులు

భద్రత ఉంటే బయటకు రావొద్దు..

అంగరక్షకులతో ఉండేవారు పోలింగ్ రోజు ఓటు వేసేందుకు మినహా బయటకు రావద్దు. ఇందుకు సంబంధించి వ్యక్తులపై నిఘా ఉంచుతారు. అయితే పోటీ చేసే అభ్యర్థులు, ఏజెంట్లకు ఈ నిబంధన వర్తించదు.

అంధుల కోసం బ్రెయిలీ బ్యాలెట్

అంధులైన ఓటర్లు స్వయంగా ఓటు వినియోగించుకునేందుకు పోలింగ్ స్టేషన్‌కు ఒకటి చొప్పున బ్రెయిలీ బ్యాలెట్‌పేపర్‌ను ప్రిసైడింగ్ అధికారి వద్ద అందుబాటులో ఉంచుతారు. అంధులు ఓటు వేసేందుకు వస్తే అధికారులు ఆ బ్యాలెట్‌ను బీయూకు అమరుస్తారు.

ఎవరి వాహనంలో వారే తిరగాలి

పోలింగ్ రోజు అభ్యర్థులు, ఏజెంట్లు అనుమతులు జారీ చేసిన వాహనాల్లో ఎవరి వాహనాల్లో వారే తిరగాలి. ఇండిపెండెంట్లు, డమ్మీ అభ్యర్థుల వాహనాల్లో ఇతరులు తిరిగినా, ఒకరి వాహనాల్లో ఇంకొకరు తిరిగినా అధికారులు గుర్తించి వాహనం అనుమతి రద్దుచేయడంతోపాటు కేసు నమోదు చేస్తారు.

రామవరం 'పొజిషన్' మారేనా..?

- పొజిషన్ సర్టిఫికెట్ కోసం స్థానికుల ఎదురుచూపులు
- ఎన్నోమార్లు ఎన్నికలు జరిగినా చిత్తశుద్ధి చూపని రాజకీయ పార్టీలు
- ఏడు వార్డులతో కొత్తగూడెం మున్సిపాలిటీలో అంతర్భాగం..
- ఈసారి గెలిచేవారైనా ఇళ్ల పట్టాలు ఇప్పించాలని వేడుకోలు



రామవరం ఏరియా

సింగరేణి(కొత్తగూడెం): జిల్లా కేంద్రంలో అంతర్భాగంగా ఉన్న రామవరం ప్రజలు పొజిషన్ పట్టాలు(స్థిర నివాస సర్టిఫికెట్లు) కోసం దశాబ్దాలుగా ఎదురుచూస్తున్నారు. 130 ఏళ్ల క్రితం ఈ ప్రాంతం ఏర్పడగా, ఎన్నోమార్లు ఎన్నికలు జరిగాయి. ప్రతిసారి ఎన్నికల ముందు నాయకులు హామీలు ఇవ్వడం, అనంతరం విస్మరించడం ఇక్కడి ప్రజలను ఆవేదనకు గురిచేస్తోంది. నేడు శాసనసభ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈసారి గెలిచే అభ్యర్థులైనా తమ సమస్య పరిష్కరిస్తారేమోనని ఆశిస్తున్నారు.

సింగరేణితోపాటే పుట్టింది...

సింగరేణి ఆవిర్భవించినప్పుడే రామవరం గ్రామం ఏర్పడింది. అనంతరం కొత్తగూడెం మున్సిపాలిటీలో భాగమైంది. ప్రస్తుతం మున్సిపాలిటీలో 36 వార్డులు ఉండగా, 7 వార్డులు రామవరం ప్రాంతంలో ఉన్నాయి. సుమారు 3 వేల ఇళ్లకు పొజిషన్ పట్టాలు జారీ చేయాల్సి ఉంది. అయితే 1/70 చట్టం పేరుతో ఏజెన్సీ ప్రాంతమని, పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వడం సాధ్యం కాదని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో యాజమాన్య హక్కులు లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డాక కొత్త జిల్లాలు, కొత్త మండలాలు ఏర్పడినప్పుడు రామవరం సమస్య కూడా పరిష్కారమవుతుందని ఈ ప్రాంతవాసులు భావించారు. కానీ ఎప్పటిలాగే నిరాశే ఎదురైంది. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో ఇక్కడి ప్రజలు ముందు వరుసలోనే నిలిచారు. తెలంగాణ వచ్చి పదేళ్లవుతున్నా వీరి సమస్య మాత్రం పరిష్కారం కాలేదు.


జీఓ నం.76 పరిధి నుంచి తొలగింపు

2020 నాటికి సింగరేణి స్థలాల్లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నవారికి పట్టాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీఓ నంబర్ 76 తెచ్చింది. కానీ జీఓ పరిధి నుంచి రామవరంలోని 7 వార్డులు తొలగించారు. మున్సిపాలిటీలో మొత్తం 36 వార్డులు ఉండగా, రామవరంలోని 7 వార్డులే ఏజెన్సీలో ఉన్నాయని చెబుతున్నారు. ఒకే మున్సిపాలిటీలో ఇదెలా సాధ్యమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఒక వేళ ఏజెన్సీలో ఉంటే మున్సిపాలిటీలో ఎలా చేర్చారని పేర్కొంటున్నారు. జిల్లాలోని భద్రాచలం, సారపాక గ్రామాలు ఏజెన్సీ సమస్యతో మున్సిపాలిటీలుగా రూపాంతరం చెందలేకపోయాయని, మరి ఇక్కడ మున్సిపాలిటీలో ఎలా అంతర్భాగమయ్యాయని అడుగుతున్నారు. అనేక మంది ఎమ్మెల్యేలు, ఎంపీలు, మున్సిపల్ చైర్మన్లు తమ ఓట్లతో గెలిచారుకానీ, తమకు పొజిషన్ సర్టిఫికెట్లు ఇప్పించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రామవరం ప్రాంతం నుంచి గెలిచిన కౌన్సిలర్లు మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లుగా ఎంపికయ్యారని, అప్పుడు అడ్డురాని చట్టాలు తమ పట్టాల జారీకే అడ్డు వస్తున్నాయని వాపోతున్నారు.

సీఎస్సార్ నిధుల కేటాయింపులోనూ వివక్షే..

రామవరం ప్రాంతంలో గతంలో నాలుగు బొగ్గు గనులు వన్ ఇంక్లైన్, 2 ఇంక్లైన్, 3 ఇంక్లైన్, 4 ఇంక్లైన్ ఉండేవి. కాలక్రమంలో మూతపడ్డాయి. ఇక్కడి జీకే ఓసీలో 30 ఏళ్ల పాటు బొగ్గు వెలికితీశారు. బాంబుల పేలుళ్లతోపాటు గని నుంచి వెలువడే డస్ట్, బొగ్గు పొడి వ్యాపించి పలువురు అనారోగ్యానికి గురయ్యారు. సింగరేణి సంస్థ ఉత్పత్తి చేసే బొగ్గు అమ్మకంలో వచ్చే నిధుల్లో టన్నుకు రూ.10 చొప్పున కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ(సీఎస్సార్) కింద ప్రభావిత ప్రాంతాలకు కేటాయించాలని బొగ్గు పరిశ్రమల స్టాండింగ్ ఆర్డర్స్ చెబుతున్నాయి. కానీ సింగరేణి యాజమాన్యం ఈ ప్రాంత అభివృద్ధికి సహకరించకపోగా, ప్రభావితంకానీ ప్రాంతాలకు ఖర్చు చేస్తోందని రామవరం ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఇప్పుడూ 130 ఏళ్లనాటి పరిస్థితే..



సింగరేణి పుట్టినప్పుడే రామవరం పుట్టింది. 130 ఏళ్ల చరిత్ర ఉంది. కానీ నాడు ఏ విధంగా ఉందో ఇప్పుడూ అదేపరిస్థితి. సుమారు 3 వేల ఇళ్లకు పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వాల్సిఉంది. పాలకులు ఎన్నికల సమయంలో ఓట్లు వేయించుకుని, ఆ తర్వాత ఈ ప్రాంతాన్ని పట్టించుకోవటం లేదు. ఈసారైన హక్కు పత్రాలు ఇప్పించాలి. – మునిగడప పద్మ, 10వ, వార్డు కౌన్సిలర్

ఊరెళ్తున్నాం.. ఓటేస్తాం!

అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ గురువారం జరగనుండగా జిల్లా కేంద్రంతో పాటు ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారు స్థలాలకు బయలుదేరారు. ఖమ్మంలో ఉంటున్న వారే కాకుండా ఉద్యోగ, వ్యాపార రీత్యా వివిధ ప్రాంతాల్లో ఉంటున్న వారు ఖమ్మం చేరుకుని ఇక్కడి నుంచి బస్సుల్లో స్వగ్రామాలకు వెళ్లారు. దీంతో ఖమ్మంలోని కొత్త బస్టాండ్ బుధవారం సాయంత్రం కిక్కిరిసి కనిపించింది. –స్టాఫ్ ఫొటోగ్రాఫర్



